# కళను నేనే.. కవితను..నేనే..

కళను నేనే.. కవితను..నేనే..
సమాజ హితం కోరే.. రేపటి భవితను..నేనే...
గగనంలో ఎగిరే..
వేకువ పతాకను..నేనే..
సాగర గర్భంలో నివసించే..
స్వాతిముత్యాన్నీ..నేనే..
ప్రేమ అలలుగా ప్రవహించే..
సజీవ నదీమ గీతాన్ని..నేనే..
సమాజంలో జరిగే అవినీతి,
అణచివేతలపై..బ్రద్దలైన అక్షరాల..
అగ్ని పర్వతాన్ని..నేనే..
చీకటి గుండెను చీల్చే..
వెలుతురు ఖడ్గము..నేనే..
సమతా మమతలు పండిస్తూ..
కవన సేద్యం చేసే కర్షకుడినీ..నేనే..
సరిహద్దు రేఖపై..దేశాన్ని భుజాన మోసే..
సైనికుడినీ నేనే.. భరతమాత సేవలో..
అంకితమైన దేశభక్తుడునీ..నేనే..
కలమే నా ఆయుధమై..
కాలమనే  కదనరంగంలో.. కదులుతుంటాను..
బతుకు యోధుడునై..నేనే..
జనారణ్యంలోని.. కాలకూట విష నాగుల..
కోరలు పీకేదీ..నేనే..
నిరంతరం ఆత్మ జ్ఞానాన్ని బోధించే
 బోధి చెట్టును..నేనే..
సమసమాజ స్థాపనకై...
నిత్యం పల్లవించే..
కళను..నేనే.. కవితను..నేనమ



## కవిత పాటిబండ్ల

# చిందించు.. ఓ.. చిరునవ్వు

చిరునవ్వే మనిషికి అందం
చిరునవ్వే మనసుకు ప్రతిబింబం
చిరునవ్వులు చిందే మోములో
మురిపించు ఎన్నో అభిమానాలు
మరిపించు ఎన్నో ఎన్నెన్నో కష్టాలు

ఒక్క చిరునవ్వు ముఖాన మురిసితే
ఒక వ్యక్తిని చూడగానే చిరునవ్వు విసిరితే
పరిచయానికి పలకరింపులా...
స్నేహానికి చాచిన హస్తంలా..
ప్రేమలు చూపిన దారిలా...
చుట్టాలకు అభిమానంలా..
బంధువులకు అనురాగంలా..
ప్రేమికులకు ఆప్యాయత చూపేలా...
శత్రువులను సైతం దగ్గరచేసేలా..
ఆపదలో ఉన్నవారికి అభయహస్తంలా
రోగపిడితులకు ఓదార్పులా..
ఇలా...
ఎన్నో ఎన్నెన్నో.. అర్థాలకు
అలవోకగా కలిసే అవకాశాలకు
అర్థం...పరమార్థం గా నిలుస్తుంది
మంచితనానికి సూచికగా కనిపిస్తుంది
మరపురాని వ్యక్తిగా నిలుపుతుంది
చిరునవ్వులు చిందించే మోము
కల్మశాలు లేని తెరచిన మానసం
అందుకే..
చిందించండి.. ఓ.. చిరునవ్వు
నలుగురిలో మెరుస్తావు నువ్వు



## లగిశెట్టి ప్రభాకర్

# ఆనందం కేరాఫ్ అడ్రస్

ప్రపంచమంతా గాలించా
జీవితమంతా వెతికా
శాపింగ్ మాల్ లో అడిగా
ఆన్ లైన్ లోఆర్డర్ చేసా
విహారయాత్రలకెళ్ళా
పుణ్యతీర్థాలు దర్శించా
పుస్తకాలు చదివా
గూగుల్ లో సెర్చ్ చేసా
మేధావులను అడిగా
స్నేహితులతో తిరిగా
ఆనందం చిరునామా కై
అన్వేషించా
వెన్నెల లో విహరించా
ప్రేయసి కన్నుల్లో వెదికా
వ్యసనాలకు బానిసనై
వ్యర్ధ ప్రయత్నం చేసా

ప్రశ్నల కొక్కానికి వేళ్ళాడుతూనా
అన్నీ కంటితుడుపు సమాధానాలే

శాశ్వతమైనఆనందానికి
నిర్వచనం దొరక్క
ఒక నిర్వేదానికి లోనై
విసిగి వేసారి ఇంటికొచ్చి
అలసిన దేహంతో
వాలిన కనురెప్పలతో
ప్రశాంతంగా కూర్చున్న
ఒక ధ్యాన ముద్రలో



ఒక నిద్ర ఒక మెలకువ కాని
సుషుప్తావస్థలో
వెల్లివిరిసిన జ్ఞానసేత్రం
విశ్వమానవ ప్రేమతత్వం

ఆశ్చర్యంగా ఆనందం
నా ఎదుట ప్రత్యక్ష మైంది
చిరునవ్వులు నవ్వుతున్న
నా ప్రతిరూపం

వర్తమానంలోనే
నిజమైన ఆనందం
తాత్వికమైన ఆత్మానందం
నిత్యం మనలోనే మనతోనే

"ఇష్టమైనది చేయడం కాదు
చేస్తున్న పనినే ఇష్టంగా చేయడం ఆనందం
పరుల సేవలోనే పచ్చనీ ఆనందం

కృతకమైన లోకంలో
కలుషిత మైన బతుకులను
పరిత్యజిస్తూ
సహజమైన ప్రకృతిలో
తాధాత్మ్యం చెందడం
ధ్యానం చేయడమే
అసలైన ఆనందం"

మరణానంతరం మనిషి
ఆనందంగా బ్రతికే అమృతోత్సవం

-సరికొండ నరసింహా రాజు









వార్త

06 Dec 2024 - Page 4

## ఘనంగా స్వచ్ఛంద సేవకుల దినోత్సవం

ఆవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

**మలక్ పేట,డిసెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజలు, ప్రభుత్వాలు స్వచ్ఛంద సేవకుల, సంస్థల కృషిని అభినందించి ప్రోత్సహిం చాలని మాజీ సెంట్రల్ మినిస్టర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియే షన్ ప్రెసిడెంట్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీత్యాగరాయ గానసభ లో "అంత ర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం" ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలు గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నాయని వివ రించారు. అనంతరం ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలు నర్ల సురే ష్, అలియా భాను, మిరియాల లక్ష్మి, నరసింహులు గౌడ్, ఎస్.రేష్మ కౌర్, కె.విజయకుమార్, జె.నాగలక్ష్మి, ఉన్నవ వెంక టేశ్వర్లు లను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూధన్ రావు, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కూరపాటి శ్యాందన్, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, ...శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కవిత్వపు కంకణం

పసిడి సిరులు పొంగే
పల్లెటూర్ల వైపు తొంగిచూడు...
పసితనం తల్లినోదిలి సేళ్లలో
సెట్టుకు ఉయ్యాలలూగుతుంది...
బాల్యం సెలక మట్టి కింద
మాణిక్యంలా మగ్గిపోతుంది...
పందిరిలో పెళ్లికూతురుల కూర్చున్న
వికసించి వికసించని పుష్పాలెన్నో...
మగ బిడ్డల కోసం మధ్యలోనే
తెగిపడిన ఆడ భ్రూణాలెన్నో...
మాటల తూటాలకు మానసికంగా
మరణిస్తున్న వితంతువులెందరో...
పిల్లలు లేక తల్లి కాలేక వెలుగుకై
చీకట్లో దాగిన పడతులేందరో...
కాటికెళ్లే వరకు కడుపుకింత కూడు
దొరికితే చాలనుకునే వృద్ధులెందరో...
పల్లెను ఒకసారి పలకరించి చూడు
పక్షపాతం ఏంటో పరిచయం చేస్తాది...
ఉన్నోడు, లేనోడు ,తక్కువ కులం,
ఎక్కువ కులం, ఆడ, మగ అంటూ...
అంటు కట్టిన మూడ ఆచారాలను
వంట పట్టించుకున్న మూర్ఖులెందరో...
మనుగడ అంత ఒకటే అయినా
మనుషుల్లో తారతమ్యాలెన్నో...
మార్పు కోరి మంచి మాటలు
చెబితే శత్రువుని అవుతున్న...
మార్పు తేవాలన్న నా కల
కలగానే మిగిలిపోరాదని...
కవిత్వపు కంకణం తొడిగి
కదనానికి కలంతో సిద్ధమవుతున్న...



సత్యముని నవీన్